ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

రెబ్బెన, ఆగస్టు 23 : గంగాపూర్ వాగు నుంచి అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లు పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్ర శేఖర్ తెలిపారు. మండలంలోని వాగుల నుంచి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పొరసరఫరాల శాఖ మేనేజర్ బాధ్యతలు

నస్పూర్, ఆగస్టు 23 : పౌరసరఫరాల శాఖ మంచిర్యాల జిల్లా మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకళ శుక్రవారం కలెక్టర్ కుమార్ దీపక్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. పూల మొక్కను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ.. శాఖాపరంగా కేటాయించిన విధులను అధికారుల సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. శ్రీకల నిర్మల్ జిల్లా నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు.

బుగ్గగూడెంలో అక్షరాభ్యాసం

కాసిపేట, ఆగస్టు 23 : మండలంలోని బుగ్గగూడెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాధిక మాట్లాడుతూ.. 3 ఏళ్ల నుంచి 5 ఏళ్ల లోపు పిల్లలను అంగన్‌వాడీ కేంద్రంలో ఉంచాలని, వీరికి పూర్వ ప్రాథమిక విద్య ద్వారా మెదడు అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ రాజమణి, సహాయకురాలు, తల్లిదండ్రులు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పంటల పరిశీలన

కాసిపేట, ఆగస్టు 23 : మండలంలోని కనకలాపూర్‌లో పత్తి పంటను క్షేత్ర సందర్శనలో భాగంగా ఏవో చల్ల ప్రభాకర్ సందర్శించారు. ప్రస్తుతం పత్తి పంట శాకీయోత్పత్తి దశ నుంచి మొగ్గ దశలో ఉన్నదని, ప్రస్తుతం పత్తిలో రసం పీల్చే పచ్చ దోమ, తెల్ల దోమ ఉన్నదని, నివారణకు ఎసిఫేట్ 300 గ్రాములు గానీ, ఇమిడాక్లోప్రిడ్ 80 మీల్లీ లీటర్లు గానీ, ఫ్లూనికామైడ్ 75 గ్రాములును ఎకరానికి 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలని ఏవో సూచించారు.

ఇద్దరి అరెస్ట్

వాంకిడి, ఆగస్టు 23 : గంజాయి తరలిస్తున్న తిర్యాణి మండలం రోంపల్లి గ్రామానికి చెందిన పెంద్రం శ్యాంరావ్, మహారాష్ట్రలోని గట్ చందూర్‌కు చెందిన బోయ భాస్కర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ప్రశాంత్ తెలిపారు. తమ సిబ్బందితో శుక్రవారం తనిఖీలు నిర్వహించగా, శ్యాంరావ్, భాస్కర్ వద్ద 650 గ్రాముల గంజాయి లభ్యమైందన్నారు. దానిని స్వాధీనం చేసుకొని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఏఎస్ఐ పోశెట్టి, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పాలాల అమావాస్య నిర్వహణపై సమావేశం

కాసిపేట, ఆగస్టు 23 : పొలాల అమావస్య నిర్వహణపై మండలంలోని సోమగూడెంలో శుక్రవారం నేతకాని మహర్ కుల సంఘం సమావేశం నిర్వహించారు. వచ్చే నెల 2, 3 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు 25న బెల్లంపల్లిలోని ఎస్సీ కమిటీ హాల్‌లో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. నేతకాని మహర్ కులస్తులు, కులపెద్దల సమక్షంలో నిర్ణయం తీసుకొని, పండుగ విజయవంతం కోసం చర్చించనున్నట్లు తెలిపారు. నాయకులు దాగం మల్లేశ్, గుమాస భీమయ్య, దాగం రాయలింగు, గోదారి రాయలింగు పాల్గొన్నారు.

రెండు లక్షల రుణమాఫీ అందరికి వర్తింపచేయాలి

రెబ్బెన, ఆగస్టు 23: రైతులందరికి రెండు లక్షల రుణమాఫీ చేయాలని, రెబ్బెన పీఏసీఎస్‌లో అవినీతికి పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కేసరి అంజనేయులుగౌడ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని రైతు వేదిక వద్ద శుక్రవారం బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ సొల్లు లక్ష్మి, జిల్లా ఉపాధ్యక్షుడు గులబం చక్రపాణి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలకృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి నవీన్‌గౌడ్, పలువురు ఉన్నారు.

నాసిరకం బూట్లతో కార్మికులకు ప్రమాదాలు

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : సింగరేణి యాజమాన్యం కార్మికులకు నాసిరకం బూట్లు ఇవ్వడంతో ప్రమాదాలకు గురవుతున్నారని గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ శ్రీరాంపూర్ బ్రాంచి కార్యదర్శి ఎస్‌కే బాజీ సైదా ఆరోపించారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 1గనిని ఆయన సందర్శించి కార్మికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్మికులకు నాణ్యతగల భూట్లు అందించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా సహాయ కార్యదర్శి కొమురయ్య, ఫిట్ కార్యదర్శి దాడి రాజయ్య, కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, సహాయ కార్యదర్శి వేణు, పరుశురాములు, ప్రసాద్, నాయకులు వంశీ, రాజు పాల్గొన్నారు.

కార్మికులతో మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి బాజీసైదా

చర్యలు తీసుకోవాలి

కాగజ్‌నగర్, ఆగస్టు 23 : మహారాష్ట్రలోని నాసిక్‌లో ఇటీవల జరిగిన బహిరంగ సభలో ప్రవక్తపై ఓ వ్యక్తి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పట్టణంలోని ముస్లింలు శుక్రవారం జామా మసీదు నుంచి ర్యాలీ తీశారు. అనంతరం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు వినతిపత్రం అందించారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎంఐఎం పార్టీ పట్టణాధ్యక్షుడు ఎండీ ముబీన్, మత గురువులు, మత పెద్దలు పాల్గొన్నారు.

బీమా పథకం కలిగి ఉండాలి

పెంచికల్‌పేట్, ఆగస్టు 23 : బ్యాంక్ ఖాతాదారులు తప్పనిసరిగా బీమా పథకాలను కలిగి ఉండాలని తెలంగాణ గ్రామీణ బ్యాంక్ రాస్పల్లి శాఖ మేనేజర్ సాయి చరణ్ సూచించారు. పోతెపల్లి గ్రామానికి చెందిన తెలిగే పెంటయ్య ఇటీవల అనారోగ్యతో మృతి చెందాడు. ఆయన పీఎం జీవన్ జ్యోతి బీమా చేయించుకొని ఉండడంతో నామినీ భార్య తెలిగే పోచక్కకు శుక్రవారం రూ.2లక్షల బీమా పరిహారం చెక్కును అందజేశారు. బ్యాంక్ అధికారులు, ప్రవీణ్, సత్తిరెడ్డి, మాజీ సర్పంచ్ దాసరి చంద్రమౌళి పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరణ

వాంకిడి, ఆగస్టు 23 : వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌గా బీ రాందాస్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన సంపత్ కుమార్ బదిలీపై వరంగల్ జిల్లా నర్సంపేట వెళ్లారు.

రీడింగ్ కాంపేన్

రెబ్బెన, ఆగస్టు 23 : పిల్లలలో చదివే అలవాటు పెంచటానికి కథల పుస్తకాలు దోహ దం చేస్తాయని మండల నోడల్ అధికారి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్ ఎం బత్తుల సదా నందం, ఉపాధ్యాయులు ప్రవీణ్ ఉన్నారు.

తెగుళ్ల నివారణ

మందమర్రి రూరల్, ఆగస్టు 23 : వరిలో తూర్పు, పడమర దిశలుగా కాలిబాటలు ఏర్పాటు చేస్తే పంట తెగుళ్ల బారి నుంచి రక్షించుకోవడంతో పాటు, అధిక దిగుబడులు సాధించే అవకాశం ఉందని వ్యవసాయ విస్తీర్ణ అధికారి ముత్యం తిరుపతి పేర్కొన్నారు. మండలంలోని చిర్రాకుంటలో శుక్రవారం రైతులకు ఖాళి బాట విధానం, ఉపయోగాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు బొలిశెట్టి శ్రీనివాస్, గంధ రాంచందర్, కోట్రంగి శ్రీను, సోదరి యాదగిరి, చిరంజీవి పాల్గొన్నారు.

తాండూర్ ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా ప్రేమ్‌కుమార్

తాండూర్, ఆగస్టు 23 : సాధారణ బదిలీల్లో భాగంగా తాండూర్ వ్యవసాయాధికారిగా విధులు నిర్వహించిన గాదర్ల కిరణ్మయి మందమర్రికి బదిలీ అయ్యారు. బెల్లంపల్లి మండల వ్యవసాయాధికారి సుద్దాల ప్రేమ్‌కుమార్‌కు ఇన్‌చార్జి వ్యవసాయాధికారిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రేమ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.

శాంతి భద్రత పరిరక్షణకు కృషి

పెంచికల్‌పేట్, ఆగస్టు 23 : శాంతి భద్రతల పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి, సిబ్బందికి సూచనలు చేశారు. ముందుగా పోలీస్‌స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఐ కొమురయ్య, సిబ్బంది ఉన్నారు.

సేఫ్టీ ఆఫీసర్‌కు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : శ్రీరాంపూర్ ఎస్ఆర్పీ 3గనిలో సేఫ్టీ ఆఫీసర్‌గా పనిచేసి బదిలీపై వెళ్తున్న అదనపు మేనేజర్ శ్రీధర్‌ను శుక్రవారం గనిపై టీబీజీకేఎస్ నాయకులు సన్మానించారు. టీబీజీకేస్ ప్రధాన కార్యదర్శి కే సురేందర్‌రెడ్డి, కేంద్ర నాయకులు సాధుల భాస్కర్, గోపీనాయక్, ఉత్తేజ్‌రెడ్డిలు అధనపు మేనేజర్ శ్రీధర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశం, సతీష్ యాదవ్, వెంకట్‌రెడ్డి, రమణారెడ్డి, సిరాజ్, పాషా, నరేందర్, రంజిత్ పాల్గొన్నారు.

లాబాల్లో వాటా ఇవ్వాలి

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : సింగరేణి కాంట్రాక్టు కార్మికులకు సంస్థ లాబాల్లో వాటా చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ బెల్లంపల్లి రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్ డిమాండ్ చేశారు. శుక్రవారం శ్రీరాంపూర్ టింబర్ యార్డులో ఏర్పాటు చేసిన కాంట్రాక్ట్ వర్కర్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో డివిజన్ అధ్యక్షుడు దొడ్డిపట్ల రవీందర్, కార్యదర్శి బూర వీరేశం, ఉపాధ్యక్షుడు కాతరాజు ప్రభాకర్, సహాయ కార్యదర్శి సురేంద్ర చారి, రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింగరేణి ఉపాధ్యాయుడిపై సస్పెన్షన్ వేటు

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : కొత్తగూడెం సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై అతడిపై సస్పెన్షన్ వేటు వేస్తూ సింగరేణి (ఎడ్యుకేషనల్ సొసైటీ) నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం ఉపాధ్యాయుడు పోలీసుల అదుపులో ఉన్నాడని, తక్షణమే అతనిపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని జీఎం నికోలస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విచారణ తర్వాత ఆరోపణళు రుజువైతే చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని స్పష్టం చేశారు.

వాహనాల తనిఖీ

సిర్పూర్(యు), ఆగస్టు 23 : మండల కేంద్రంలో ఎస్ఐ రామకృష్ణ రావు శుక్రవారం వాహనాలను తనిఖీ చేసి, డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైవర్లు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలను పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, ధ్రువ పత్రాలు కల్గి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వేణుగోపాల్, పోలీసులు జగదీష్, కేశవరావ్ తదితరులున్నారు.

బాలికలు అన్ని రంగాల్లో రాణించాలి

సిర్పూర్(యు), ఆగస్టు 23 : బాలికలు అన్ని రంగాల్లో రాణించాలని ఎస్ఐ రామకృష్ణరావ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కేజీబీవీ విద్యార్థినులతో మాట్లాడారు. వారికి చట్టాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేకాధికారి సప్న సిబ్బంది ఉన్నారు.

గోలేటి సీహెచ్‌పీలో బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

ఉత్తమ సీహెచ్‌పీగా నిలపాలి

రెబ్బెన, ఆగస్టు 23 : బెల్లంపల్లి ఏరియా లోని గోలేటి సీహెచ్‌పీని ప్రతి సంవత్సరం ఉత్తమ సీహెచ్‌పీగా నిలిపి అవార్డులు వచ్చే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. బెల్లంపల్లి ఏరియాలోని గోలేటి సీహెచ్‌పీలో పర్యటించిన జీఎం రవాణా, పరిసరాలలో నీటిని చల్లె విధానం, ఆన్‌లైన్ మానిటరింగ్ పరిశీలించి సిబ్బందిని అభినందించిన అనంతరం మాట్లాడారు. ఉత్తమ సీహెచ్‌పీగా అవార్డు అందుకున్నందుకు అధికారులు, ఉద్యోగులను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు పేర్కొన్నారు. జీఎంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారి సీహెచ్‌పీకి వచ్చిన జీఎంను ఉద్యోగులు సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ భీంరావుజాడే, సీహెచ్‌పీ హెచ్‌వోడీ కోటయ్య, ఈఈ రాజు లతో పాటు పలువురు ఉన్నారు.

జీఎం మోహన్‌రెడ్డికి సన్మానం

జీఎం సీపీసీ మోహన్‌రెడ్డిని సన్మానిస్తున్న బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్

రెబ్బెన, ఆగస్టు 23 : బెల్లంపల్లి ఏరియా పర్యటనకు కార్పొరేట్ జీఎం(సీపీసీ) మోహన్‌రెడ్డిని గోలేటి జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్‌హాల్‌లో ఘనంగా సన్మానించినట్లు బెల్లంపల్లి ఏరియా పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి తెలిపారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందించారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, పీవో మచ్చగిరి నరేందర్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి లు ఉన్నారు.

సేఫ్టీ జీఎంకు సన్మానం

శ్రీరాంపూర్, ఆగస్టు 23 : సింగరేణి కార్పొరేట్ సేఫ్టీ జీఎంగా పనిచేసి పదవీ విరమణ పొందుతున్న జీ మోహన్‌రెడ్డిని శుక్రవారం శ్రీరాంపూర్ జీఎం ఆఫీస్‌లో ఇన్‌చార్జి జీఎం టీ శ్రీనివాస్, సేఫ్టీ జీఎం చింతల శ్రీనివాస్‌లూ సన్మానించారు. కార్యక్రమంలో రీజియన్ జీఎం సేఫ్టీ రఘుకుమార్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, ఏజీఎం మురళీధర్, పీవో ఏవీరెడ్డి, డీవైజీఎం అరవిందరావు పాల్గొన్నారు.

మందమర్రిలో..

మందమర్రి రూరల్, ఆగస్టు 24 : ఈనెల 31న ఉద్యోగ విరమణ పొందనున్న జీఎం(సీఎంసీ) మోహన్ రెడ్డిని ఏరియా జనరల్ మేనేజర్ ఆఫీస్ ఆవరణలో శుక్రవారం ఏరియా అధికారులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన సేవలను కొనియాడుతూ శేష జీవితం ఆరోగ్యంతో సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రాజేశ్వరరెడ్డి, పర్సనల్ మేనేజర్ శ్యామ్ సుందర్, ఐఈడీ రాజన్న అధికారులు పాల్గొన్నారు.

అక్రమంగా ఆవులను తరలిస్తున్న ఐచర్ వ్యాన్ పట్టివేత

వాంకిడి, ఆగస్టు 23 : అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న ఆవుల ఐచర్ వ్యాన్‌ను శుక్రవారం సాయంత్రం వాంకిడి ఎస్ఐ ప్రశాంత్ ఆధ్వర్యంలో జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని గోయగాం గ్రామంలో దాడిచేసి ఐచర్ వ్యాన్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఐచర్ వ్యాన్‌లో ఉన్న 27ఆవులను స్వాధీనం చేసుకుని కాగజ్ నగర్ గోశాలకు తరలించినట్లు ఎస్ తెలిపారు.

వికటించిన టీకా

సౌదీలో జగిత్యాల జిల్లా వాసి యువకుడి నరకయాతన

జగిత్యాల టౌన్, ఆగస్టు 23: హైదరాబాద్‌లోని ఒక గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో టీకా వేయించుకొని సౌదీకి వెళ్లిన ఓ యువకుడు టీకా వికటించి అస్వస్థతకు గురై నరకయాతన అనుభవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. జగిత్యాల జిల్లా కోరుట్ల మండలం సంగెం గ్రామానికి చెందిన పోతుగంటి చంద్రశేఖర్ జూన్ 24న హైదరాబాద్‌లోని గల్ఫ్ మెడికల్ సెంటర్‌లో వైద్య పరీక్షలతోపాటు టీకా వేయించుకున్నాడు. ఢిల్లీలోని హెచ్‌ఆర్ ఇంటర్నేషనల్ అనే రిక్రూటింగ్ ఏజెన్సీ ద్వారా జాబ్ వీసాపై జూలై 11న సౌదీ అరేబియాలోని ఆల్-బాద్ తాబూక్‌కు వెళ్లాడు. అక్కడ ఫ్యామ్కో కంపెనీ నియోమ్ ప్రాజెక్ట్‌లో క్లీనింగ్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. కొన్నిరోజుల తర్వాత టీకా తీసుకున్న కుడి భుజానికి ఇన్ఫెక్షన్ అయింది. మెరుగైన చికిత్స కోసం స్వదేశానికి పంపించాలని మొరపెట్టుకున్నా ఎవరూ పట్టించుకోవడంలేదని చంద్రశేఖర్ తల్లి ఆవేదన వ్యక్త చేసింది. తిరిగి స్వదేశానికి అత్యవసరంగా రప్పించడానికి చర్యలు తీసుకోవాలని అతని తల్లి లక్ష్మి గురువారం హైదరాబాద్‌లోని విదేశాంగ శాఖ పీవోఈ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించింది.

రాజన్న ఆలయంలో కొనసాగిన ఏసీబీ తనిఖీలు

వేములవాడ, ఆగస్టు 23: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని వేములవాడ రాజన్న సన్నిధిలో ఏసీబీ అధికారుల తనిఖీలు రెండో రోజైన శుక్రవారం కూడా కొనసాగాయి. గురువారం 20 మంది ఏసీబీ అధికారుల బృందం 12 గంటల పాటు తనిఖీ చేయడంతోపాటు రికార్డు చేయగా, రెండోరోజు పది మంది అధికారులు స్వామివారికి సంబంధించిన లీజులు, పలు విభాగాల టెండర్లు, నిత్యాన్నదాన సత్రానికి సంబంధించిన పలు రికార్డులను 4 గంటలపాటు పరిశీలించారు. లడ్డూ ప్రసాదాల తయారీ, విక్రయాలు, గోదాం నిల్వలు, లీజుల టెండర్లు, వసతి గదుల సముదాయాలు, నిత్యాన్నదానం తదితర అంశాలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేసినట్టు తెలిసింది.

దక్షిణ మధ్య రైల్వే
Follow us on @SCRailwayIndia
ద.మ. రైల్వే యొక్క టెండరు ప్రకటనల వివరాలను మా వెబ్‌సైట్ www.scr.indianrailways.gov.in పై చూడవచ్చును.

ఇ-టెండరు కోరుతూ ప్రకటన
(http://ireps.gov.in ద్వారా)

దిగువ పనుల కొరకు భారత రాష్ట్రపతి తరపున సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్, ట్రాక్షన్ డిస్ట్రిబ్యూషన్, సికింద్రాబాద్ వారు సింగిల్ ప్యాకెట్ టెండరింగ్ విధానంలో ఇ-టెండరు కోరుతున్నారు.

క్ర.సం.01 **NIT No: C/E.29/TRD/SC/23/2024-25, పని పేరు:** టెండరు నం. C/E.29/TRD/ SC/ 23/ 2024-25, తేది: 20-08-2024. SC డివిజన్: PDPL-NZB: పెద్దపల్లి జంక్షన్-లింగంపేట జగిత్యాల సెక్షన్‌పై యాంటి మంకీ క్లైంబింగ్ డివైస్ ఏర్పాటుచేయుట. **అంచనా వ్యయం: రూ. 26,13,712/-, పూర్తి చేయు కాలం:** 90 రోజులు, **ముగింపు తేది:** 16-09-2024న, 15.00 గం.

1) బిడ్ డాక్యుమెంటు మరియు ఇతర వివరాల కొరకు వెబ్‌సైట్ http:// ireps.gov.in కు లాగిన్ కాగలరు.
2) టెండరుదార్లు ఇ-టెండరింగ్ ద్వారా మాత్రమే పాల్గొనవలెను మరియు మ్యాన్యువల్ ఆఫర్లు పరిశీలించబడవు.
3) టెండరు ఫారం ధర & బయానాను ఆన్‌లైన్ చెల్లింపుల ద్వారా మాత్రమే చెల్లించాల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
4) GSTIN ఐడెంటిఫికేషన్ నెం.లు పొందవల్సిందిగా మరియు తమ ఆఫర్లతో పాటు దాఖలు చేయవల్సిందిగా కాగోరు టెండరు దారులందరు కోరబడుచున్నారు.
5) టెండరు దాఖలుచేయు కాలవ్యవధి యొక్క ప్రారంభ తేదీ వరకు టెండరుదారు ఏదేని సవరణల (ఆన్‌లైన్‌పై మాత్రమే జారీ చెయ్యబడును) కొరకు గమనించగలరు.

సీనియర్ డివిజినల్ ఎలక్ట్రికల్ ఇంజినీర్ / TRD/సికింద్రాబాద్
A1061

తదుపరి టెండరు నిబంధనలు/వివరాల కోసం మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కోసం వెబ్‌సైట్ https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in దర్శించండి.

విష జ్వరంతో చిన్నారి మృతి

గీసుగొండ, ఆగస్టు 23: విష జ్వరంతో చిన్నారి మృతి చెందిన ఘట న వరంగల్ జిల్లా గీసుగొండ మండలంలోని విశ్వనాథపురంలో శుక్రవా రం జరిగింది. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దూల మహేందర్-శ్రీలత దంపతుల కుమార్తె నిత్యశ్రీ (9) వరంగల్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నది. 20న నిత్యశ్రీకి జ్వరం రావడంతో తల్లిదండ్రులు స్థానిక వైద్యుడిని సంప్రదించి సిరప్ వాడటంతో తగ్గింది. గురువారం చిన్నారికి వాంతులు, విరేచనాలు కావడంతో హనుమకొండలోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స అందిస్తుండగా బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి చనిపోయినట్టు తల్లిదండ్రులు తెలిపారు.

వనపర్తి జిల్లాలో దాహం.. దాహం

- నిలిచిన మిషన్ భగీరథ సరఫరా
- తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు

వనపర్తి, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ) : వనపర్తి జిల్లాలో దాహం కేకలు వినిపిస్తున్నాయి. ఐదు రోజులుగా మిషన్ భగీరథ నీటి సరఫరా నిలిచిపోవడంతో ప్రజలు తాగునీటి కోసం తంటాలు పడుతున్నారు. భగీరథ పైపులైన్‌కు అదనంగా పెద్దమందడి మండలం బుగ్గపల్లితండా వద్ద ప్రత్యేక ప్లాంటేషన్ ఏర్పాటు చేశారు. ఈ పథకంలోనే దాదాపు 57 కిలోమీటర్ల ప్రత్యేక లైన్‌కు ఆరుచోట్ల వాల్వ్‌లు ఏర్పాటు చేయలేదు. వేసవిలో చేయాలనుకున్నా నీటిఎద్దడి ఏర్పడుతుందన్న కారణంతో అప్పట్లో అధికారులు విరమించుకున్నారు. ప్రస్తుతం ఈ పనులు చేపట్టడంతో జిల్లాలోని సగభాగానికిపైగా పట్టణాలు, గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయింది. దీనికితోడు రాజపేట సమీపంలో భగీరథ పైపులైన్ పగలడంతో నీటి సమస్య మరింత తీవ్రమైంది. కొన్ని ప్రాంతాల్లో అధికారులు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నా ప్రజలకు సరిపోవడం లేదు. స్థానికంగా అందుబాటులో ఉన్న వ్యవసాయ బోరుమోటర్లను ఆశ్రయిస్తున్నారు. భగీరథ పథకంలో పలు పోస్టులు ఖాళీలు ఉండటంతో పర్యవేక్షణ కొరవడిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. మిషన్ భగీరథ ఈఈ మేఘారెడ్డి మాట్లాడుతూ పైపులైన్లను అనుసరించి కొన్ని వాల్వ్‌లు ఏర్పాటు చేయడం కోసం నీటి సరఫరాను నిలిపివేసినట్టు తెలిపారు. రెండు రోజుల్లో పూర్తి చేయాలనుకున్నా వర్షాల కారణంగా ఆటంకం ఏర్పడిందని పేర్కొన్నారు.

జగత్‌పల్లి సమీపంలో ఎయిర్‌వాల్వ్ గుంతలోంచి నీటిని తొలగిస్తున్న దృశ్యం

కరెంట్ షాక్‌తో యువ రైతు మృతి

రాజంపేట్, ఆగస్టు 23: పొలంలో విద్యుత్తు షాక్ తగిలి రైతు మృతి చెందిన ఘటన కామారెడ్డి జిల్లా రాజంపేట్ మండలం అన్నారం తండాలో శుక్రవారం చోటుచేసుకున్నది. తండాకు చెందిన రైతు బానోత్ తిరుపతి(33) తనకున్న రెండెకరాలతోపాటు మరో ఐదు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శుక్రవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన తిరుపతికి.. పక్కనున్న పొలానికి కరెంట్ సరఫరా కోసం తీసుకున్న వైర్లు ప్రమాదవశాత్తు తగలడంతో అక్కడికక్కడే మృతి చెందాడు.

వేతనాల కోసం అంగన్‌వాడీల ధర్నా

కామారెడ్డి, ఆగస్టు 23: వేతనాలు విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ మినీ అంగన్‌వాడీ నిర్వాహకులు శుక్రవారం కామారెడ్డి కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. వేతనాలు రాకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. టీచర్లు, ఆయాలకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందజేయాలని కోరారు.

'తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవు'

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): తల్లి స్వార్జిత ఆస్తిపై పిల్లలకు హక్కులు ఉండవని, స్వార్జిత ఆస్తిని తనకు ఇష్టం వచ్చిన వాళ్లకు ఇచ్చే అధికారం తల్లికి ఉంటుందని హైకోర్టు కీలక తీర్పు చెప్పింది. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో సుశీల్ అగర్వాల్ అనే మహిళకు భర్త నుంచి సంక్రమించిన ఇంటిని ముగ్గురు కుమారులకు సమానంగా పంచకుండా పెద్దకుమారుడి పేరుతో గిఫ్ట్ సెటిల్మెంట్ డీడ్ చేయడాన్ని సివిల్ కోర్టు సమర్థించింది. దీన్ని సవాల్ చేస్తూ భజరంగ్‌లాల్ అగర్వాల్ అనే వ్యక్తి హైకోర్టులో దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్‌ను జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ ఎంజీ ప్రియదర్శిని ధర్మాసనం కొట్టివేసింది. ఆ ఆస్తిని ఉమ్మడి కుటుంబ ఆస్తిగా ప్రకటించాలన్న వాదన చట్ట వ్యతిరేకమని తేల్చింది. ఆ ఆస్తి యజమానిగా తల్లికే పూర్తి హక్కులు ఉంటాయని తీర్పు చెప్పింది.

ఆ అధికారం ఐటీడీఏ పీవోలకు లేదు

- సివిల్ సూట్ల విచారణపై హైకోర్టు స్పష్టీకరణ
- పెండింగ్ సూట్లను కలెక్టర్లకు అప్పగించాలని తీర్పు

హైదరాబాద్, ఆగస్టు 23 (నమస్తే తెలంగాణ): ఏజెన్సీ ప్రాంతాల్లో సివిల్ సూట్లను విచారించే అధికారం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి (పీవో)కి లేదని హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ఏజెన్సీ చట్ట నిబంధనల ప్రకారం సివిల్ సూట్లపై విచారణ జరిపే అధికారం జిల్లా కలెక్టర్లకు మాత్రమే ఉన్నదని, ఆ